క్లుప్తంగా

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వెంకటాపురం(కె): చెట్టు పైనుంచి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని మైతాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొచ్చు అన్నయ్య రోజు మాదిరిగా కల్లు కోసం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భద్రాచలంకు తీసుకెళ్లారు.

నేడు హుండీ లెక్కింపు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మల హుండీల కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఈఓ రాజేంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో జరిగిన మినీ జాతర సందర్భంగా భక్తుల కానుకల కోసం అమ్మవార్ల గద్దెలపై ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. మేడారంలోని ఎండోమెంట్ కార్యాలయం డార్మెంటరీ భవనంలో పూజారుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు.

పద్మశాలీ పరపతి సంఘం నూతన కమిటీ ఎన్నిక



ములుగు: పద్మశాలీ పరపతి సంఘం అధ్యక్షుడిగా సమాల మోహన్ ఎన్నికయ్యారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సంఘం 23వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గుర్రపు శ్రీధర్, ఉపాధ్యక్షులుగా నామాల చంద్రమౌళి, కోడూరు రవి, కోశాధికారిగా ఆడెపు రాజు, సహాయ కార్యదర్శులుగా సబ్బాని రవీందర్, పెండెం భిక్షపతి, సహాయ కోశాధికారిగా ఇంజపూరి నరసింహారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా మార్త రమేశ్‌బాబు, ఆముదాల భాస్కర్‌లు వ్యవహరించి కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

పునరావాసం కల్పించాలి

ములుగు: లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కింద 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మాజీ నక్సలైట్లు భిక్షపతి, ఈశ్వరీ, శానబోయిన అశోక్, రవీందర్, సాంబయ్య, సంజీవ్, వెంకట్రాం, కొంరయ్య, శ్రీరాములు, రవి, సమ్మయ్య, వీరన్న సోమవారం జిల్లా కలెక్టర్ కృష్ణా ఆదిత్యకు వినతిపత్రం అందించారు. దళం నుంచి బయటికి వచ్చినప్పటికి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత ఆరేడు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ నిబంధనల ప్రకారం సహాయం అందేలా చూస్తానని అన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి



ములుగు రూరల్: విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రవితేజ డిమాండ్ చేశారు. సోమవారం విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగపేట మండలం దేవనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంకిడి బుచ్చయ్య పాఠశాలకు హాజరుకాకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని అన్నారు. ములుగు వెలుగు అటెండెన్స్ యాప్‌ను తప్పుతోవ పట్టిస్తూ విధులకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శివకేశవ్, స్వామి, బాలు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మహాముత్తారం: మండలంలోని మాదారం గ్రామానికి చెందిన రాజమల్లమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ అజీమాబేగం, సింగిల్‌విండో డైరెక్టర్ అల్లాఉద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్‌రావు, మొగిలి మల్లయ్య ఉన్నారు.

కేజీబీవీల్లోని సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(ఎం): నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ ఉద్యోగులు

ములుగు: కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి శిరుప సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. భోజన విరామంలో మాధవరావుపల్లి కేజీబీవీ పాఠశాలలో సంఘం మండల అధ్యక్షుడు అజ్మీరా దశరథ్, ప్రధాన కార్యదర్శి దాసరి రామ్మూర్తిలతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో మహిళా ఉపాధ్యాయులు వెట్టిచాకిరి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమానంగా కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ, పోరిక రమణ, సువర్ణ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: కస్తూర్బాగాంధీ పాఠశాలలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూశాఖ మండల అధ్యక్షుడు సల్లూరి రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లోని ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుహాసిని, సంధ్యారాణి, నాగమ్మ, సుజాత,సంజీవరాణి, సౌజన్య సుమలత,వనిత పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయిలో..



ములుగులో..

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ కేజీబీవీ పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తూ చిన్నచూపు చూస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మదుసుధన్ ఆరోపించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ లలిత, ఉద్యోగులు దేవి, శారద, చందన, మమత, నందిని, ఉమ, ప్రతిభ పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించాలి



ఐటీడీఏ పీఓకు వినతి పత్రం అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్

ఏటూరునాగారం: ములుగు జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ద్వారా గిరిజనులకు ఉపాధి కోసం కల్పించాలని జిల్లా గ్రంథాలయం చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏపీఓ అంకిత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మహిళా గిరి జ నుల ఉపాధి కోసం ఎంఎస్ఎంఈ కింద జేఎల్‌జీ గ్రూప్ ఏర్పడి బంజార, వేషధారణ, బట్టలు కుట్టుమిషన్ యూనిట్‌ను అందించాలని కోరారు. ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో పాఠకులు, విద్యార్థుల కోసం సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రూప్ 1, 2, ఇతర కాంపిటీషన్ కోసం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించాలన్నారు. తాడ్వాయిలోని పాత భవనానికి మరమ్మతు చేసి కలరింగ్ చేయించాలని విన్నవించారు.

స్వచ్ఛభారత్ మిషన్ పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ మెహరున్నీసా

ఏటూరునాగారం : భారత ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ మెహరున్నీసా, మాస్టర్ ట్రైనర్ రహిమొద్దీన్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంకుడుగుంతల నిర్మాణం, క్లోరినేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడుగుంతలు, సామాజిక మరుగుదొడ్లు కార్యాలయాల్లో నిర్మించాలన్నారు. ఇంటింటికి మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు తీసుకుంటేనే కొత్త ఇంటినిర్మాణాలకు అనుమతి ఇవ్వాలన్నారు. వర్మికంపోస్టులను తయారు చేసుకొని ఇంటి మొక్కలకు ఉపయోగించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ట్రాక్టర్‌లో తరలించాలి. మహిళా సంఘాలు, వీఓలను అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు కుమార్, రామకృష్ణ, ములుగు ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ



వెంకటాపురం(కె) : వాలీబాల్ కిట్లను అందజేస్తున్న అధికారులు



వాజేడు: విజేతకు బహుమతి అందజేస్తున్న కమాండెంట్ రమాకాంత్

వెంకటాపురం(కె): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గిరిజన గ్రామాల యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. సోమవారం సీఆర్‌పీఎఫ్ 39/ఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించి గిరిజన గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పోలీస్‌స్టేషన్ క్రీడా మైదానంలో పలు గ్రామాల నుంచి వచ్చిన యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.అనంతరం యువతకు వాలీబాల్ కిట్స్, షటిల్ బ్యాట్స్, షూస్, టీషర్ట్స్‌ను సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కె పండా, సీఐ శివప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ, వైద్యాధికారులు భారతి, శ్రీకాంత్, ఎస్సై తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: యువతకు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ 39 బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్, షటిల్ కిట్లను పంపిణీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల యువతకు వాలీబాల్ పోటీలను స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం పోలీసులు విద్యార్థులతో పాటు కేజీబీవీ విద్యార్థినులకు షటిల్ బ్యాట్లు, టీ షర్ట్‌లను ఇచ్చారు. అక్కడే వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 39 బెటాలియన్ కమాండెంట్ రమాకాంత్, ఎస్సై రేఖ అశోక్, వైద్యురాలు భార్గవి, శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టాలి



ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని దానిని అరికట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు సంజీవ అన్నారు. సోమవారం తహసీల్దార్ అల్లం రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి అమ్మకాలు చేపడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు గొంది రాజేష్, డీవైఎఫ్ఐ దేవరాజు, రామక్రిష్ణ, బుజ్జిబాబు, జీవన్, అరుణ్, శ్రావణ్, గణేష్, అరవింద్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పశుసంపద పెంపునకు కృషి



గేదెకు ఇంజక్షన్ వేస్తున్న వైద్యుడు రాకేశ్‌శర్మ

కాటారం: గ్రామాల్లో పశుసంపద పెంపొందించడానికి మార్కెట్ కమిటీ ద్వారా కృషి చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పెండ్యాల మమతమనోహర్ అన్నారు. మండలంలోని గుండ్రాత్‌పల్లిలో సోమవారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి రాకేశ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు సీజనల్‌వ్యాధులు సోకకుండా మందులు, ఇంజక్షన్లు ఇచ్చారు. పశువుల్లో కృత్రిమ గర్భదారణ ప్రక్రియకు సంబంధించి పశుపోషకులకు వివరించి పశువులకు ఆర్టిఫిషియల్ ఇన్సెమినేషన్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మమత మనోహర్ మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను పశుపోషకులు, పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పాడి సంపద అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ సెక్రటరీ, డీఎంఓ కనకశేఖర్, వైద్యులు రాకేశ్‌శర్మ, అభిషేక్, వెటర్నిటీ అసిస్టెంట్ రాజశేఖర్, గోపాలమిత్ర శ్రీనివాస్, మార్కెట్ కమిటి డీఈఓ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను విస్మరిస్తే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం



జెండావిష్కరిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

టేకుమట్ల: వెనకబడిన సామాజిక వర్గాల్లో ముందు వరుసలో ఉన్న వడ్డెరలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని తెలంగాణ వడ్డెర సంఘం, అండ్ చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షులు బత్తుల రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సంపంగి రాయమల్లు అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనాదిగా దినసరి కూలీలుగా బతుకులు కొనసాగిస్తున్న వడ్డెరలను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్, సబ్సిడీ పథకాలు లేవని రెక్కాడితే డొక్కాడని వడ్డెర జీవితాల్లో మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి రమేష్, ఉపాధ్యక్షులు ఆలకుంట శంకర్, కోశాధికారి రేపాల ఓదెలు, పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలని ధర్నా



ములుగు రూరల్ : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు అందించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారి విజయభాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇంచర్ల పంచాయతీ పరిధిలోని ఎర్రిగట్టమ్మ వద్ద ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న వారికి జీఓ నెంబర్ 58,59 ప్రకారం పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గద్దల లక్ష్మీ, ఝాన్సీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి



వండిన వంటను పరిశీలిస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

ఏటూరునాగారం : పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. సోమవారం రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆమె సందర్శించారు. పరీక్షకు ప్రిపేర్ కావాలని మంచి ఫలితాలు సాధించి మంచి భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని కోరారు. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, హైస్కూల్ ఇన్‌చార్జ్ రమాదేవి, ఉపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిట్యాల : ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు

కాటారం: సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని మహదేవపూర్ సీడీపీఓ రాధిక అన్నారు. పోషణపక్షంలో భాగంగా మండల కేంద్రంలోని శ్రీహర్షిత డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం, ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి ఎనీమియా గూర్చి వివరించారు. పౌష్టికాహారం, చిరుధాన్యాలతో ఆహారపదార్థాల తయారీపై అవగాహన కల్పించి చిరుధాన్యాలతో తయారు చేసిన పలురకాల ఆహారపదార్థాలను ప్రదర్శించారు. హ్యాండ్‌వాష్‌పై విద్యార్థులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ రాగులు, అరిగెలు, సామలు, కొర్రలు, సజ్జలు, జొన్నలు మొదలగు చిరుధాన్యాలు ప్రతిరోజు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, సరస్వతి, రమాదేవి, భాగ్యలక్ష్మి, శివరాణి, పోషణ్ అభియాన్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పలిమెల : పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు, గర్భిణులు, బాలికలకు చిరుధాన్యాలు, పౌష్టికాహారం, పెరటితోటల పెంపకంపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయలు, ఆకుకూరలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, సుశీల, కిష్టబాయ్, కిషోర బాలికలు, బాలింతలు, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

చిట్యాల: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటునే ఆరోగ్యంగా ఉంటారని ఏఎల్ఎంఎస్‌సీ సభ్యురాలు, అంగన్‌వాడీ టీచర్ సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం, చిరుధాన్యాల వంటకాలతో వచ్చే లాభాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు, రాగులు, సజ్జలు, కొర్రలు, సమాలు, ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం హ్యాండ్‌వాష్ ప్రోగ్రాం చేసి పోషణ్ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ చైర్మన్ గుర్రపు కోమల, ఆశ వర్కర్ విజయ, కమిటీ సభ్యులు జన్నె స్వప్న, కుమ్మరి లావణ్య, శిలపాక శ్యామల, రమ్య, సరిగమ్ముల పూజ, గుర్రం సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలి



మహాముత్తారం: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ ముక్కెర రాజేశ్వరి కోరారు. మండలంలోని సింగారంలో సోమవారం ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర మమత, వైద్య సిబ్బంది రాజబాబు, రాజేందర్, స్వరూప, జ్ఞానేశ్వరి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సర్వేతో రైతులకు అన్యాయం



నష్టపోయిన పంటను చూపిస్తున్న రైతు

చిట్యాల: ఇటీవల కురిసిన అకాలవర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అధికారులు చేపట్టిన సర్వే అన్యాయం చేస్తుందని మండలంలోని తిరుమలపూర్‌కు చెందిన రైతులు వాపోయారు. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన రైతులు గుర్రం శ్రీనివాస్, గోల్కొండ కుమార్, చిలకల సతీష్ కంచర్ల లక్ష్మణ్, గోపగాని సదానందం, రాంబాబు తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయి ఉన్నామని తెలిపారు. పంటలు నష్టపోయిన పొలాలు, చేనులు సర్వేలు చేయకుండా గ్రామానికి చెందిన రైతు సమితి గ్రామశాఖ అధ్యక్షుడు చెప్పిన వారి పంటనే ఏఈఓ సర్వే చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా వ్యవసాయ అధికారులు, కలెక్టర్ స్పందించి నష్టపోయిన రైతుల పంటల్లో సర్వేలు చేపట్టి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు.

మండల జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మహదేవపూర్: మండల ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి చెన్నూరు రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ రాజమౌళి, మండల ఇన్‌చార్జ్ రాజబాబు అధ్యక్షతన మండల గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సీఐటీయూ) కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వంగళ రాజ మౌళి, అధ్యక్షుడిగా ఠాగూర్ కేసర్ సింగ్ ఉపాధ్యక్షులుగా జనగం సరోజన, చేకుర్తి దేవరాజు, ప్రధాన కార్యదర్శి జిముడ రాజబాబు, సహాయ కార్యదర్శి లేతకారి రాజయ్య, కుతుబుద్దీన్, కోశాధికారిగా పులియల మహేష్‌తో పాటు ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

30న సీతారాముల కల్యాణం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

చిట్యాల: ఈనెల 30న మండలంలోని చల్లగరిగలో జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దావు వినోదవీరారెడ్డి సర్పంచ్ మంజుల అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణానికి సంబంధించిన ఆహ్వాన వాల్‌పోస్టర్‌ను వారు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్ర జాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభం



ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెంలోని రైతు వేదికలో సోమవారం ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ మాధవి, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి శిరీష, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.